తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా భవనంలో బుధవారం 13 మంది తలసేమియా చిన్నారులకు రక్త మార్పిడి చికిత్స నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా వ్యాధికి నివారణ లేదని, తల్లిదండ్రులకు జన్యు పరీక్షల ద్వారా, ప్రీ ఇంప్లాంటేషన్ జెన్యూ నిర్ధారణ పరీక్షల ద్వారా, నవజాత శిశువులకు తలసేమియా వ్యాధి రాకుండా ఆపగలమని అన్నారు. వ్యాధి వచ్చిన తర్వాత క్రమం తప్పకుండా రక్తమార్పిడి చేయించుకోవాల్సిందేనన్నారు. ప్రతిఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. తలసేమియా చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు 30 మందికి మధ్యాహ్నం ఉచిత భోజనాన్ని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు కనకమేడల సురేష్‌బాబు, ప్రోటీన్ పౌడర్లను రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ఎన్‌జివిబి.స్వామి ఏర్పాటు చేశారని తెలిపారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, ఎన్‌జివిబి.స్వామి, బి.ప్రసాద్, డాక్టర్ స్పందన, పాల్గొన్నారు.

'రీసర్వే' సమస్యలు పరిష్కారమయ్యేనా..!

'ద్వారకాతిరుమల మండలం వేంపాడు గ్రామంలో తండ్రి కుమారునికి కొంత పొలం రిజిస్టర్ చేశారు. ఆ భూమిని ఆన్‌లైన్ చేసిన రెవెన్యూ అధికారులు పాస్‌బుక్ సైతం ఇచ్చారు. రీసర్వే చేస్తున్నట్లు సమాచారం కూడా సదరు రైతుకు చెప్పకుండా సర్వే పూర్తయినట్లు చూపారు. కుమారుడు పేరున ఉన్న భూమి ఆన్‌లైన్‌లో మళ్లీ తండ్రి పేరున చూపిస్తోంది' ఇదేమని రెవెన్యూ అధికారులను అడిగితే ఇప్పటి వరకూ సమాధానం లేదు.'

'ఆకివీడు మండలంలోని ఓ గ్రామంలో వివాదాస్పద భూమికి సంబంధించి జాయింట్ కలెక్టర్ కోర్టులో కేసు నడుస్తోంది. కనీసం సమాచారం ఇవ్వకుండా సర్వే పూర్తి చేసినట్లు చూపిన అధికారులు ఆ భూమిని మరో వ్యక్తికి ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పరిస్థితి ఉంది.'



రెవెన్యూ సదస్సుల్లో రీసర్వే సమస్యలపై రైతుల వినతులు

భూముల విస్తీర్ణంలో తేడాలు, ఆన్‌లైన్ నమోదులో తప్పులే అధికం

సర్వేలో గుర్తించిన ఆక్రమణలకు గురైన చెరువుల పరిస్థితి ఏమిటో?

ఏలూరు జిల్లాలో 248 గ్రామాలు, పశ్చిమలో 173 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

రైతుల సమస్యలకు పరిష్కారం దొరికేనా అంటూ చర్చ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వైసిపి హయాంలో జరిగిన రీసర్వే సమస్యలు రెవెన్యూ సదస్సుల్లో పరిష్కారమయ్యేనా అనే చర్చ గ్రామాల్లో నడుస్తోంది. రీసర్వే సమస్యల పరిష్కారం కోసం అంటూ ఈ నెల 16న రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. వచ్చే నెల 15వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. చాలామంది రైతులు రీసర్వేతో ఏర్పడిన సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇస్తున్నారు. రెవెన్యూ సదస్సులు జరుగుతున్నట్లు గ్రామాల్లో సరైన అవగాహన లేదని చెబుతున్న పరిస్థితి ఉంది. పూర్తిస్థాయిలో రీసర్వే జరిగిన గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. ఏలూరు జిల్లాలో 24 మండలాల పరిధిలో 248 గ్రామాల్లో పూర్తిస్థాయిలో రీసర్వే జరిగింది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాల పరిధిలో 173 గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. ఆయా గ్రామాల్లో మాత్రమే రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేలో భూముల వివరాలు తప్పుల తడకగా నమోదు చేసినట్లు రైతులు చెబుతున్నారు. రీసర్వేపై రైతులకు నోటీసులుగాని, సమాచారంగాని ఇవ్వకుండానే సర్వే పూర్తి చేసిన పరిస్థితి ఉందని రైతులు గగ్గోలు పెట్టారు. దీంతో ఎకరం భూమి ఉంటే రీసర్వే తర్వాత 95 సెంట్లుగా నమోదు చేశారు. అదేమని రైతు సర్వే చేయించుకుంటే తన భూమి ఎకరా ఉంది. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం తక్కువ భూమి నమోదైంది. నమోదైన విషయం కూడా తన భూమిని విక్రయించేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే వరకూ తెలియని పరిస్థితి ఉంది. ఒకరి పేరున ఉన్న భూమిని వేరొకరి పేరున ఆన్‌లైన్ చేయడం వంటి సమస్యలు చాలా ఎక్కువగా ఉన్నాయి. అదేమని రైతులు ప్రశ్నిస్తే సమస్య పరిష్కారం తమ చేతుల్లో లేదని అప్పట్లో రెవెన్యూ అధికారులు తెలిపిన పరిస్థితి ఉంది. ఇలాంటి సమస్యలు ఉన్న రైతులంతా ఇప్పుడు రెవెన్యూ సదస్సుల్లో వినతులు ఇస్తున్నారు. ఈ వినతులు ఎప్పటికి పరిష్కారమవుతాయో వేచిచూడాలి. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతుల పరిష్కారంపై ఏలూరు డిఆర్ఒ పుష్పమణిని వివరణ కోరగా సదస్సులు పూర్తయిన తర్వాత వినతుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఆక్రమిత చెరువుల సంగతేంటి?

మెట్ట ప్రాంతంలో ప్రతి గ్రామంలోనూ పెద్దఎత్తున తాగు, సాగునీటి చెరువులు ఉన్నాయి. చాలా చెరువులు సెంటుభూమి కూడా మిగలకుండా ఆక్రమణకు గురైన పరిస్థితి ఉంది. ఆయా గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యింది. ఆక్రమణకు గురైన చెరువుల భూములు సర్వేలో గుర్తించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ భూములను ఆక్రమణ చెర నుంచి తప్పించి చెరువులను కాపాడేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో అర్థం కావడం లేదు. ఆక్రమణల్లోని చెరువుల భూములను స్వాధీనం చేసుకోకపోతే రీసర్వే ఉపయోగం ఏమిటని, రెవెన్యూ సదస్సుల వల్ల ప్రయోజనం ఏమిటనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. భీమడోలు మండలం పొలసానిపల్లి రెవెన్యూ పరిధిలో 40 వరకూ చెరువులు ఉన్నట్లు తెలుస్తోంది. చెరువులన్నీ ఆక్రమణలకు గురయ్యాయి. ఈ చెరువుల భూములపై అధికారులు ఎటువంటి స్పష్టతా ఇవ్వడం లేదు. అత్యధికంగా మెట్టప్రాంతంలో వందలాది చెరువుల పరిస్థితి ఇలానే ఉంది. దీంతో రెవెన్యూ సదస్సుల తీరుపై గ్రామాల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

దీపావళికి ఉచిత సిలిండర్

ఏలూరు జిల్లాలో 6.44 లక్షలు, పశ్చిమలో 6.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు

విధివిధానాలపై స్పష్టత కోసం ఎదురుచూపు

బిపిఎల్ పరిధిలోని జనరల్ కనెక్షన్‌దారులకు ఉచిత గ్యాస్ అందేనా?

ఇసుక లేకుండా సీనరేజ్, జిఎస్‌టి రద్దుతో ప్రయోజనం ఏమిటని ప్రశ్నలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏడాదికి ఉచితంగా మూడు వంటగ్యాస్ సిలిండర్ల అందజేత పథకాన్ని దీపావళి నుంచి ప్రారంభించేందుకు, ఇసుకపై సీనరేజ్, జిఎస్‌టి రద్దుకు రాష్ట్ర మంత్రిమండలి బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో ఉచిత గ్యాస్ సిలిండర్ల అందజేతపై జనాల్లో పెద్దఎత్తున చర్చ సాగుతోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వం విధివిధానాలు ప్రకటించకపోవడంపై ఈ పథకం ఏవిధంగా అమలు చేస్తారో అర్థంకాని అయోమయ పరిస్థితి నెలకొంది. ఏలూరు జిల్లాలో 6.44 వంటగ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం కనెక్షన్లు 1.91 లక్షలు, ఉజ్వల కనెక్షన్లు 27,639, సిఎస్ఆర్ కనెక్షన్లు 18,243, మిగిలిన నాలుగు లక్షలకుపైగా జనరల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. పశ్చిమలో మొత్తం 6.25 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా, దీపం వినియోగదారులు లక్షా 85 వేల వరకూ ఉన్నారు. మిగిలినవి ఇతర గ్యాస్ కనెక్షన్లుగా ఉన్నాయి. ఈ నెల 25 నుంచి నెలాఖరు వరకూ ఉచిత గ్యాస్ సిలిండర్లు బుక్ చేసుకోవాలని, తర్వాత వాటిని అందించడం జరుగుతుందని ప్రభుత్వం తెలిపింది. నాలుగు నెలలకు ఒక ఉచిత సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించింది. వినియోగదారులు పూర్తిగా సొమ్ము చెల్లించి సిలిండర్ కొనుగోలు చేసిన తర్వాత ఆ సొమ్మును 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో వేసేలా కేబినెట్‌లో ఆమోదముద్ర పడింది. అయితే బిపిఎల్ పరిధిలోని తెల్లకార్డుదారులందరికీ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వర్తింపజేస్తారా, లేక షరతులు విధిస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు ప్రకటించాల్సి ఉంది.

ఇసుక లేదాయే..!

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇసుక కోసం జనం నానాపాట్లు పడుతున్నారు. రెండు జిల్లాల్లో ఇసుక ర్యాంపులు ఇప్పటికీ తెరుచుకోలేదు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటలో ఇసుక ఉన్నట్లు చెబుతున్నా ఆన్‌లైన్‌లో బుక్ కావడం లేదు. ఆన్‌లైన్‌లో ఇసుక దొరకడం లేదుగాని, బ్లాక్‌మార్కెట్‌లో మాత్రం ఇసుక పుష్కలంగా దొరుకుతోంది. ఇసుక అందుబాటులోకి తీసుకురాకుండా సీనరేజ్, జిఎస్‌టి రద్దు చేయడం వల్ల ప్రయోజనం ఏమిటనే చర్చ జనాల్లో నడుస్తోంది. ఉచిత ఇసుక పేరుతో అసలు ఇసుకే లేకుండా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక అందుబాటులోకి తెస్తే ప్రభుత్వం రద్దు చేసిన జిఎస్‌టి, సీనరేజ్‌తో జనానికి ఉపయోగం ఉంటుంది. ప్రస్తుతం బ్లాక్‌మార్కెట్‌లో 20 టన్నుల ఇసుక రూ.29 వేలు వరకూ విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ముందుగా ఇసుకను అందుబాటులోకి తేవాలని జనం కోరుతున్నారు.

చిరుతను పట్టుకునేందుకు చర్యలు ముమ్మరం

అదనపు బోనుల ఏర్పాటు, ట్రాప్ కెమెరాల దిశ మార్పు - కొత్తగా మంచెలపై నుంచి అటవీ శాఖ గార్డుల పహారా

కెమెరాల దిశలను సరి చేస్తున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు పరిసర ప్రాంతాల్లో కలకలం రేకెత్తిస్తున్న చిరుత పులి జాడను తెలుసుకునేందుకు అటవీ శాఖాధికారులు చర్యలు ముమ్మరం చేశారు. మంగళవారం రాత్రి చిరుత పులి భీమడోలు ప్రాంతంలో తొలుత సంచరించిన అందాలమ్మ చెరువు ప్రాంతంలోని పొలాల్లో సంచరించినట్లు దాని అడుగుజాడలను గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అటవీ అధికారులు ఆ ప్రాంతంలో అదనపు బోనులను ఏర్పాటు చేశారు. దీంతో చిరుతను పట్టుకునేందుకు అటవీ శాఖ ఏర్పాటు చేసిన బోనుల సంఖ్య 15కు చేరింది. ఇదే క్రమంలో ట్రాప్ కెమెరాలను కొన్ని ప్రాంతాల్లో దిశలు మార్చారు. దీంతోపాటు అదనంగా బుధవారం రాత్రి నుంచి చిరుత జాడ తెలుసుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. దీని కోసం వ్యవసాయ క్షేత్రాల్లో ఎత్తుగా మంచెలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మంచెలపై రాత్రి సమయంలో అటవీ శాఖకు చెందిన ఇద్దరు గార్డులు పహారా కాస్తారు. రాత్రి సమయంలో సైతం చూసేందుకు అనువైన పరికరాలను ధరించిన వారు చిరుత పులి కదలికలు గుర్తించేందుకు ప్రయత్నిస్తారని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



చిరుత పులి జాడ కోసం ఏర్పాటుచేసిన మంచెలు



వినతి అందిస్తున్న గిరిజనులు, సిపిఎం నేతలు

గిరిజనుల భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొన్ని సంవత్సరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములను పారదర్శకంగా సర్వే చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం.దుర్గారావు కోరారు. బుధవారం మండలంలోని వంకవారిగూడెం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ రాధాకృష్ణకు ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ దానంవారిగూడెం రెవెన్యూ పరిధిలో కొన్ని సంవత్సరాలుగా గిరిజనుల సాగులో ఉన్న భూములను ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల సాగులో ఉన్న భూములను పారదర్శకంగా సర్వే చేసి ఆన్‌లైన్‌లోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచి కుంజా.పార్వతి, విఆర్ఒలు పాషా, జోగిరాజు, కె.రాముడు, కార్యదర్శి ఖాజబాబు పాల్గొన్నారు.

వినతి అందిస్తున్న స్కూల్ స్వీపర్లు

సమస్యలు పరిష్కరించాలని స్కూల్ స్వీపర్ల వినతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఎంఇఒకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ స్వీపర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని, మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు ఇవ్వాలని, శానిటేషన్ పరికరాలు, బ్లౌజులు, మాస్కులు, శానిటేషన్ చీపుర్లు, ఫినాయిల్ మొదలైనవి ప్రభుత్వం సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. శానిటేషన్ కార్మికులందరినీ నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, సెలవులు ఇవ్వాలని, మట్టి ఖర్చులు, దహన సంస్కారాలకు డబ్బులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యడ్లపల్లి మంగమ్మ, పూల్లపల్లి బేబీ, మద్దిపాటి జయసుశీల, డి.వెంకటలక్ష్మి, పుష్పలత, నాగమణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలు, ట్యాక్సీలపై ఇ-చలానాలు రద్దు చేయండి

మంత్రికి ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆటోలు, ట్యాక్సీలపై ఇ-చలానాలను రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు విజయవాడలోని ఆయన క్యాంప్ ఆఫీసులో బుధవారం ఉదయం ఫెడరేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఏలూరు నగరంలో స్టాప్‌లైన్ వైలేషన్ పేరుతో విధిస్తున్న ఇ-చలానాలను రద్దు చేయాలని, స్టాప్‌లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటోలు, ట్యాక్సీలపై రూ.300 నుండి రూ.30 వేల వరకు విధించిన ఇ-చలానాల వల్ల డ్రైవర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. యువగళం పేరుతో నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, జిఒ నెం.21ను రద్దు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎన్.శివాజీ, ముజఫర్, నాయకులు అహ్మద్, చక్రాల అమర్‌కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మంత్రికి వినతి అందించి సమస్యలు వివరిస్తున్న నేతలు

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

ఆలస్యంగా వెలుగులోకి

ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎంఇఒ విచారణ

విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పిన ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - టి.నరసాపురం

రెండో తరగతి విద్యార్థి సిరిబత్తుల భువనేశ్వరకుమార్‌ను ఉపాధ్యాయుడు చితకబాదిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మండలంలోని వెలగపాడు ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంఇఒ విచారణ చేపట్టగా ఉపాధ్యాయుడు విద్యార్థి తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. వెలగపాడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదివే విద్యార్థి, మరో విద్యార్థి ఇద్దరూ కర్రలతో మంగళవారం స్కూల్ వద్ద గొడవపడ్డారు. దీన్ని చూసిన ఉపాధ్యాయుడు రామాంజిబాబు ఇరువుని మందలించి కొట్టగా భువనేశ్వరకుమార్‌కు దెబ్బలు బాగా తగిలాయి. విద్యార్థి శరీరంపై కొట్టిన గాయాలు ఉండడంతో ఆ ఫొటోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. దీనిపై విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు ఎవరూ అధికారులకు ఫిర్యాదు చేయలేదు. అయితే సోషల్ మీడియాలో వచ్చిన సమాచారం మేరకు ఉన్నతాధికారులు సంఘటనపై ఎంఇఒ రామ్మూర్తిని విచారణకు ఆదేశించారు. దీంతో ఆయన ఆ పాఠశాలకు చేరుకుని విద్యార్థి తల్లిదండ్రులు, పెద్దలు, ఉపాధ్యాయుల సమక్షంలో విచారించారు. అయితే ఉపాధ్యాయుడు క్షమాపణ చెప్పారని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని చెప్పారని ఎంఇఒ రామ్మూర్తి తెలిపారు. అయితే ఈ ఘటన జరిగిన అనంతరం ముందుగానే ఎంఇఒ విచారణకు ముందే గ్రామపెద్దలు రాజీ కుదిర్చారని, అందుకే ఎవరూ ఫిర్యాదు చేయలేదని స్థానికులు అంటున్నారు.

మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ఏలూరు జిల్లాను నెంబర్ వన్‌గా నిలపాలి

'దిశ' సమావేశంలో శాఖల పనితీరును సమీక్షించిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్

ప్రజాశక్తి - ఏలూరు

అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లోను ఏలూరు జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఏలూరు ఎంపీ, దిశ కమిటీ ఛైర్మన్ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. బుధవారం ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. దిశ కమిటీ ఛైర్మన్ హోదాలో ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి సమీక్షించారు. సమావేశంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసరావు, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఇజిఎస్, స్వచ్ఛభారత్, ప్రధానమంత్రి సడక్ యోజన, జలజీవన్ మిషన్, జాతీయ ఆరోగ్యమిషన్, విద్య, వ్యవసాయం, పిఎంఇజిపిపి, అమృత్, పిఎం విశ్వకర్మయోజన, ప్రధానమంత్రి సురక్షయోజన, జాతీయ రహదారులు, బిఎస్ఎన్ఎల్, రైల్వే, పశుసంవర్ధకశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లోనూ జిల్లాను ముందుంచాలన్నారు. ప్రభుత్వ పథకాలు, పనులకు సంబంధించి అన్ని శాఖలు లక్ష్యాలు సాధించి తీరాలని స్పష్టం చేశారు. మారుమూల గ్రామాలకు సైతం కేంద్ర ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు మరింత సమర్ధవంతంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు. బిఎస్ఎన్ఎల్, రైల్వేశాఖపై చర్చ జరగ్గా సంబంధిత ఉన్నతాధికారులు రాకపోవడంపై ఎంపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే సమావేశంలో ఇటువంటి పరిణామాలు ఎదురైతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. వ్యవసాయం, యువతకు వృత్తి నైపుణ్యశిక్షణ, ఉపాధి కల్పనకు తాము ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏలూరు నగరంతోపాటు సమీప దెందులూరు నియోజకవర్గాన్ని ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామన్నారు. పేరుకుపోతున్న ప్లాస్టిక్ వేస్ట్‌ను రీసైక్లింగ్ మేనేజ్‌మెంట్ చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. పరిశ్రమల స్థాపనకు అనువైన భూమి, నీటిలభ్యత ఉన్న భూములను గుర్తించాలని అధికారులకు ఆయన సూచించారు. ఏలూరు రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నూజివీడు రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఏలూరు, నూజివీడు రైల్వేస్టేషన్లను తాను సందర్శిస్తానన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాను మరింత ప్రగతి సాధించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల గురించి వివరించారు. చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ మధ్యాహ్నం భోజన పథకం అమల్లో భాగంగా ఫిజికల్ ఆడిట్ నిరంతరం నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు సూచించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కెఎస్ఎస్.సుబ్బారావుతోపాటు పలువురు ఎంపిపిలు, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రూ.2 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.రెండు కోట్లతో జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో సైన్సు ల్యాబ్‌లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు. సిఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిని మోడల్‌గా తీర్చిదిద్దడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటిలో ఆధునిక కిచెన్, ఇతర ఆధునికీకరణ పనులను రూ.13 కోట్లు సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేయడానికి ఆమోదం పొందామన్నారు. రైల్వే మంత్రితో సంప్రదించి కొవ్వూరు-భద్రాచలం రైల్వే లైన్ తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. బుట్టాయిగూడెం వద్ద రూ.రెండు వేల కోట్లతో నావెల్ ప్రాజెక్ట్ ఏర్పాటు కానుందని, దీనిద్వారా నాలుగు నుంచి ఆరు వేల వరకు ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

మొక్కలు నాటిన ఎంపీ, కలెక్టర్

పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ మహేష్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్లోని గోదావరి సమావేశపు హాలు ఆవరణలో కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి ఎంపీ మొక్కను నాటారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్

పారదర్శకంగా ధాన్యం సేకరణ : ఆర్‌డిఒ

భీమడోలు: మండలంలో ధాన్యం సేకరణ పారదర్శకంగా, వేగవంతంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం వివిధ అంశాలపై ఆయన వ్యవసాయ, రెవెన్యూ శాఖాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి ఉషారాణి మాట్లాడుతూ మండలంలో సుమారు 13 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారని,34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరుగుతుందని అంచనా వేసినట్లు తెలిపారు. ధాన్యం సేకరణకు రైతుసేవా కేంద్రాల వద్ద లక్షా 80 వేల గోనె సంచెలు సిద్ధం చేశామన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల సొసైటీలతోపాటు అంబరుపేట కేంద్రంగా రైతు ఉత్పత్తి సంస్థ ఏజెంట్లుగా వ్యవహరించనున్నాయన్నారు. 14 రైతు సేవా కేంద్రాలు ధాన్యం సేకరణలో సహకరిస్తాయన్నారు. ధాన్యం సేకరణ నవంబర్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఆర్‌డిఒ మండలంలో రెవెన్యూ రీసర్వే గ్రామసభల్లో వచ్చిన వినతులు, పరిష్కారాలు, ప్రజల స్పందన గురించి తహశీల్దార్ బి.రమాదేవిని అడిగి తెలుసుకున్నారు. మండల సర్వేయర్ ధర్మారావు భూముల గురించి చేసిన ఫీల్డ్ లైన్ సర్వే, మ్యూటేషన్ వివరాలను ఆర్‌డిఒకు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్ కుమారి, పౌరసరఫరాల సంస్థ డిప్యూటీ తహశీల్దార్ పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

డిసెంబర్ 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చింతలపూడి జూనియర్ సివిల్ న్యాయమూర్తి మధుబాబు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బ్యాంకు పెండింగ్ ఉన్న కేసులు, సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కక్షిదారులు, న్యాయవాదులందరూ కలిసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పేర్కొన్నారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులు రెవెన్యూ, రికవరీ, బ్యాంకు కేసులు, సివిల్, భరణం కేసులు అన్ని రాజీ చేస్తారని తెలిపారు.

విద్యుత్ శాఖ ఇన్‌ఛార్జి ఎఇగా వీరబాబు

ప్రజాశక్తి - ముసునూరు

విద్యుత్ శాఖ ముసునూరు ఇన్‌ఛార్జి ఎఇగా ఎం.వీరబాబు బాధ్యతలు చేపట్టారు. ముసునూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారిగా పనిచేస్తున్న ఎఇ బదిలీపై తిరువూరు రూరల్ వెళ్లారు. ఆ బాధ్యతలు చూసే అధికారి లేకపోవడంతో ఆగిరిపల్లి మండలం విద్యుత్ శాఖ అధికారిగా పనిచేస్తున్న ఎఇ ఎం.వీరబాబు ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందల్లేకుండా రైతులకు సక్రమంగా విద్యుత్ సరఫరా చేస్తామని తెలిపారు.

గేట్ ప్రిపరేషన్‌పై అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గేట్ ప్రిపరేషన్‌పై ఇంటరాక్టివ్ సెషన్‌ని శ్రీకాకుళం ఆర్‌జియుకెటి టిఎన్‌పిసి కో-ఆర్డినేటర్ సిహెచ్.సతీష్‌కుమార్ నిర్వహించారు. శ్రీకాకుళం ఆర్‌జియుకెటి, నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌ల విద్యార్థులకు నిర్వహించిన ఈ సెషన్‌లో అతిథిగా గేట్ ప్రో డైరెక్టర్ విఎస్‌ఆర్.సురేష్‌కుమార్ హాజరై అవగాహన కల్పించారు.

అరుదైన 15 కేజీల సీతాలు చేప లభ్యం

ప్రజాశక్తి - కలిదిండి

15 కేజీల చేపతో రైతు

చేపల చెరువుల్లో అరుదుగా లభ్యమయ్యే సీతాలు చేప బుధవారం చేపల పట్టుబడి సమయంలో వలలో చిక్కింది. మండలంలోని ఎస్ఆర్‌పి.అగ్రహారానికి రైతు నల్లగోపుల చలపతి(నాని) చెరువులో ఈ చేప ప్రత్యక్షమైంది. బరువు 15 కేజీలు ఉందని తెలిపారు. మార్కెట్‌లో దీని ఖరీదు రూ.ఆరు వేలు పలుకుతుందని భావిస్తున్నారు.

నేరాలు - ఘోరాలు

ఆలయంలో చోరీకి పాల్పడిన ఇద్దరు అరెస్టు

రూ.1.25 లక్షల సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు నగరంలోని ప్రఖ్యాతి గాంచిన రామకోటి దేవాలయంలో చోరీకి గురైన ఆభరణాలను తిరిగి ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు దేవాలయానికి చేర్చారు. ఏలూరు నగరంలోని డిఎస్‌పి కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ నెల 17వ తేదీన రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రామకోటి దేవాలయంలో వెండి, బంగారు ఆభరణాలను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఒకటో పట్టణ సిఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నగరంలోని గజ్జల వారి చెరువు సమీపంలో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను ప్రశ్నించగా చోరులు వారేనని గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి దొంగిలించిన సొత్తును, నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తూర్పు వీధికి చెందిన తిరుమల రామశివ, ఎంఆర్‌సి కాలనీకి చెందిన గడ్డి విజయ్‌కుమార్(నాని)గా గుర్తించారు. వారి వద్ద నుంచి రెండు జతల మంగళసూత్రాలు, ఒక ముక్కు పుడక, ఒక వెండి జంధ్యం, ఒక అభయ హస్తం, వెండి గిన్నెలు, చెంచాలు, వెండి పంచ పాత్రను, మరికొన్ని బంగారు వస్తువులను స్వాధీనం చేసుకున్నామని డిఎస్‌పి తెలిపారు. వీటి విలువ రూ.1.25 లక్షలు ఉంటుందని తెలిపారు. రూ.1,630 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

స్నానాల గదిలో యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఏలూరు నగరంలో మహిళా పోలీస్ స్టేషన్ పక్కన బుధవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన తాళ్లూరి శిరీష తల్లి పదేళ్ల క్రితం చనిపోవడంతో ఏలూరు నగరంలోని సౌరిపురంలో ఆమె అమ్మమ్మ ఇంటి వద్ద తన సోదరి స్వరూపతో కలిసి ఉంటుంది. శిరీష పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దనే ఉంటున్న సమయంలో కవ్వగుంట గ్రామానికి చెందిన మేడికొండ రమేష్ అనే వ్యక్తితో 2017లో వివాహమైంది. దీంతో వారు కవ్వగుంటలో ఉంటున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. శిరీష సోదరి స్వరూప ఇంటర్మీడియట్ వరకు చదివి ప్రస్తుతం అమ్మమ్మ ఇంటి వద్దనే ఉంటుంది. శిరీషను ఆమె భర్త రమేష్ కొంతకాలంగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. మూడో పట్టణ పోలీసులు ఈ విషయంపై భార్యాభర్తలకు కౌన్సెలింగ్ మళ్లీ మళ్లీ ఆమెను కాపురానికి పంపారు. అప్పటికి కూడా రమేష్ ప్రవర్తనలో ఎటువంటి మార్పు లేకపోవడంతో భర్తకు చెప్పకుండా ఆమె తన సోదరి స్వరూప దగ్గరకు వెళ్లిపోయింది. వీరిద్దరూ కలిసి విజయవాడ నగరంలోని ఓ ప్రాంతంలో అద్దెకు ఉంటూ అక్కడే పని చేసుకుంటూ రెండు వారాలుగా జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఇద్దరు కలిసి ఏలూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో శిరీష భర్తపై ఫిర్యాదు చేసేందుకు నగరానికి చేరుకున్నారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న శిరీష భర్త రమేష్, అతని బంధువులు స్వరూపను, శిరీషను ఇన్ని రోజులు ఎక్కడికి వెళ్లారని, ఎవరితో వెళ్లారని దూషించారు. కొంతసేపటికి పెద్దలు కలుగజేసుకొని సంధి చేసేందుకు కవ్వగుంట గ్రామానికి వెళ్లేందుకు నిర్ణయించారు. దీంతో శిరీష, స్వరూప మహిళా పోలీసులకు తమకు కేసు వద్దని, గ్రామంలో పెద్దల సమక్షంలో సంధి చేసుకుంటామని పోలీస్ స్టేషన్ నుంచి వెనుతిరిగారు. అదే సమయంలో స్వరూప పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న స్నానాల గదికి కాలకృత్యం తీర్చుకునేందుకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లింది. ఆమె ఎంతకీ తిరిగి రాకపోవడంతో శిరీష స్నానాల గదికి వెళ్లి చూసేసరికి స్వరూప అక్కడ చున్నితో ఉరేసుకుని ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. వెంటనే ఆమెను ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, ఎస్ఐ క్రాంతిప్రియ తమ పోలీస్ వాహనంలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయవాడ జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రస్తుతం పోలీసులు ఆమె ఆత్మహత్యాయత్నానికి ఎందుకు పాల్పడిందని, బావ పరుష పదజాలంతో ఆమెను దూషించినందుకా, లేదా మరే ఇతర కారణాలైనా ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. శిరీష ఇచ్చిన ఎంఎల్‌సి ఫిర్యాధు ద్వారా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భీమడోలు

అంబరుపేట గ్రామపంచాయతీ పరిధిలోని పాత అంబరుపేట ఆవాస ప్రాంతానికి చెందిన గాలి మహంకాళి(50) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... మహంకాళికి మద్యం సేవించే అలవాటు ఉంది. ఒక సంవత్సర కాలం క్రితం అతనికి పక్షపాతం వచ్చింది. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. తనకు ఉన్న రెండు ఇబ్బందులతో మనస్తాపానికి గురైన మహంకాళి ఈనెల 21వ తేదీ రాత్రి వ్యవసాయం కోసం ఇంట్లో ఉంచిన పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని నాగిరెడ్డిగూడెంలో చింతలపూడి ఎక్సైజ్ సిఐ పి.అశోక్ బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిత 12 డ్రమ్ముల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. నిందితుల కోసం గాలిస్తున్నామని చెప్పారు. సెట్టివారిగూడెంలో మహిళ వద్ద పది లీటర్లు నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆమెకు నాటుసారా సరఫరా చేసిన నామవరం గ్రామానికి చెందిన శ్రీను పరారీలో ఉన్నాడని చెప్పారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు

చింతలపూడి సిఐ ఎం.రవీంద్ర

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఎం.రవీంద్ర హెచ్చరిస్తున్నారు. దొంగతనాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. పేకాట, కోడిపందేలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. చిన్నతనం నుంచి పోలీస్ అవ్వాలనే లక్ష్యంతో ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని అనుకున్న లక్ష్యాన్ని సాధించిన చింతలపూడి సిఐ ఎం.రవీంద్ర ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : చింతలపూడి సర్కిల్‌లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు ?

సిఐ : అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిరంతరం మా సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశాం. ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగించినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : మెట్ట ప్రాంతంలో పేకాట, కోడిపందేలు ఎక్కువగా జరుగుతుంటాయి. వీటిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

సిఐ : పేకాట, కోడిపందేలపై ప్రత్యేక దృష్టి సారించాను. నేను చింతలపూడి సిఐగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పేకాట, కోడిపందేలపై దాడులు చేస్తూనే ఉన్నాం. అవి ఎక్కడ జరిగిన ఉపేక్షించేది లేదు. ఎవరికైనా సమాచారం తెలిస్తే మాకు తెలియజేస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతాం. సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేస్తున్నాను. ఎవరికైనా సమాచారం తెలిస్తే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రశ్న : చింతలపూడి సర్కిల్‌లో ఎక్కువ ఏ కేసులు నమోదవుతున్నాయి?

సిఐ : చింతలపూడి సర్కిల్‌లో పోక్సో, భార్యాభర్తల గొడవలు, ఆత్మహత్యల కేసులు ఎక్కువగా వస్తు న్నాయి. తొందరపడి ఆత్మ హత్యలు చేసుకుంటున్నారు. అవగాహన సదస్సులు నిర్వహించాలని అనుకుంటున్నాం.

ప్రశ్న : రోడ్డు ప్రమాదలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సిఐ : రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠినమైన చర్యలు తీసుకుంటాం. తరచూ ప్రమాదాలు జరిగే సంఘటన ప్రదేశంలో డేంజరస్ బోర్డును ఏర్పాటు చేస్తాం.

ప్రశ్న : దొంగతనాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

సిఐ : దొంగతనం జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. అంతేకాకుండా రాత్రిపూట ప్రతి ఊరిలో తిరిగే విధంగా బీట్ ఏర్పాటు చేశాం. గతంలో దొంగతనం కేసులు నమోదైన వారిపై దృష్టి పెట్టాం. ఎవరైనా ఇతర ప్రాంతాలకు వెళ్తే పోలీసులకు సమాచారం అందిస్తే ఆ ఇంటిపైన నిఘా ఉంచుతాం.

ప్రశ్న : చింతలపూడి సర్కిల్ ప్రజలకు ఏమైనా చెప్పాలనుకుంటున్నారా?

సిఐ : ప్రజల శాంతి భద్రతలకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. న్యాయం కోసం ఎప్పుడైనా ఏ సమయంలోనైనా మా వద్దకు రావచ్చు.

ప్రశ్న : చింతలపూడి సర్కిల్ పరిధిలో ఉన్న యువతకు మీరేం చెప్పాలనుకుంటున్నారు?

సిఐ : యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి. కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వెళ్లండి. మీపై మీ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని ఉంటారు. చెడు వ్యసనాలకు బానిసై బంగారం లాంటి భవిష్యత్తును పాడు చేసుకోవద్దు.

ప్రశ్న : విద్యార్థినులకు మీరు చేసే సూచనలు ఏమిటి?

సిఐ : విద్యార్థినులు ప్రేమ పేరుతో మోసపోకూడదు. తల్లిదండ్రులను బాధ పెట్టొద్దు. ప్రేమపేరుతో ఎవరైనా వెంటబడి ఇబ్బంది పెట్టినా, ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా నేరుగా మాకు తెలియజేయండి. చర్యలు తీసుకుంటాం.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - చింతలపూడి

ఐదు నెలల పెండింగ్ వేతనాలు, పెండింగ్ పిఎఫ్, ఇఎస్ఐలను విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన బుధవారంతో నాలుగో రోజుకు చేరుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, ది మెడికల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తుర్లపాటి మరియమ్మ, తిరుమలశెట్టి రాము, కూరపాటి నాగరాజు, కోడిగంటి శ్రీనివాసరాజు, పింగుల రాజకుమారి, మానేపల్లి సుజాత, గొర్రె దేవమని, బుద్ధవరపు వెంకట్రావు, వాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ జీతాలు, పెండింగ్ పిఎఫ్, ఇఎస్ఐలను విడుదల చేయాలని కోరారు. కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి పర్మినెంట్ చేయాలని గంట సేపు నిరసన తెలిపి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నిరసన కార్యక్రమానికి రైతు సంఘం మండలాధ్యక్షులు ఎస్‌కె.కాలేశా మద్దతు తెలిపారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - చింతలపూడి

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం కళాశాలలో యాంటీ డ్రగ్ అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువత డ్రగ్‌ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. సమాజంలో డ్రగ్స్ వ్యసనాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావాలన్నారు.

నూజివీడు ఆర్‌జియుకెటి, మెప్మా మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుటికె యాజమాన్యం, మెప్మా (మున్సిపల్ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన మిషన్) అవగాహన ఒప్పందం (ఎంఒయు)పై బుధవారం సంతకం చేశారు. ఈ ఒప్పందం ప్రకారం నూజివీడు పట్టణ సమైక్య గ్రూప్ నూజివీడు ఆర్‌జియుకెటి క్యాంపస్‌లో ఫుడ్ కోర్ట్, షాపులను నిర్వహిస్తుంది. విద్యార్థులు, సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను మెరుగుపరిచే చొరవపై గ్రూపు త్వరలో పనిని ప్రారంభిస్తుందని ప్రొఫెసర్ ఎస్.అమరేంద్ర కుమార్ తెలిపారు.

అయొడైజ్డ్ ఉప్పును వాడాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అయొడైజ్డ్ ఉప్పును మాత్రమే వాడాలని, దీంతో మానసిక, థైరాయిడ్ సమస్యలు రావని, పిల్లల మెదడు చురుకుగా పని చేస్తుందని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారిణి డాక్టర్ శర్మిష్ట బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నపి ల్లలు ఎదుగుదలకు, చురుకుతనంగా ఉండాలంటే అయొడైజ్డ్ ఉప్పును వాడాలని తెలిపారు. గర్భిణులు ఈ ఉప్పును వాడ డం వల్ల పుట్టే పిల్లలు చురుకుగా ఉంటారని పేర్కొన్నారు.

పలుచోట్ల గ్రామసభలు

ప్రజాశక్తి - కామవరపుకోట

రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు ఏమైన అభ్యంతరాలు ఉంటే ప్రస్తుతం జరుగుతున్న రీసర్వే గ్రామ సభల ద్వారా సరిచేసుకోవడానికి అవకాశం ఉందని తహశీల్దార్ జి.ఎలీషా అన్నారు. మండలంలోని మంకెనపల్లిలో జరిగిన రీసర్వే గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో రీసర్వే జరిగిన ఎనిమిది గ్రామాలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు నాలుగు గ్రామాల్లో ఈ సభలు నిర్వహించగా రైతుల వద్ద నుంచి 134 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిటి బి.సౌజన్య, మండల సర్వేయర్ కె.లత, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : రీసర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభలను రైతులు సద్వినియోగపర్చుకోవాలని తహశీల్దార్ పిఎన్‌వి.ప్రసాద్ కోరారు. మండల పరిధిలోని ఈదులగూడెంలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామసభలో రైతుల భూ సమస్యలకు సంబంధించి 55 అర్జీలను స్వీకరించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ మరియన్న, మండల సర్వేయర్ గంగరాజు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యూనస్, గ్రామ విఆర్‌ఒ జబీనా, రైతులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : రీ సర్వేలో తప్పులు సవరించుకునేందుకు గ్రామ సభలను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ సుభాని తెలిపారు. మండలంలోని ములకలపల్లి, అల్లూరు, ఈడేపల్లి గ్రామాల్లో బుధవారం గ్రామసభలు తహశీల్దార్ సుభాని ఆధ్వర్యంలో నిర్వహించారు. మూడు గ్రామాల్లో కలిపి 59 అర్జీలు రైతుల నుంచి అందినట్లు తహశీల్దార్ తెలిపారు. అంతేకాకుండా ఈ గ్రామసభలు జరిగే 15 రోజుల్లో కూడా రైతులు రీసర్వేకు సంబంధించిన తమ అర్జీలను సమర్పించవచ్చని తెలిపారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్‌ఆర్.పేటలో హోటల్స్, మాల్స్ వద్ద రత్నప్రసాద్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై బుధవారం అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.సూర్యచక్రవేణి, ఎఎల్ఎస్ కో-ఆర్డినేటర్ రాధాకృష్ణలతో కలిసి ఏలూరులోని హోటల్స్, మాల్స్ యజమానులకు, ఉద్యోగస్తులకు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నప్రసాద్ మాట్లాడుతూ హోటల్స్‌లో, మాల్స్‌లో, దుకాణాల్లో 18 ఏళ్ల లోపు బాలలను పనిలో చేర్చుకోరాదని చెప్పారు. బాలలను కార్మికులుగా చేర్చుకున్న దుకాణాలు, షాపుల లైసెన్సు రద్దు చేయడమే కాకుండా చట్టప్రకారం శిక్షకు గురవుతారని చెప్పారు. యజమానులే కాకుండా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కూడా దీనిపైన దృష్టి సారించాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే 1098కు కాని 15100కు కాని సమాచారం అందించాలని తెలిపారు. డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారని, ఈ జాతీయ లోక్ ఆదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, కుటుంబ వివాదాల కేసులను, బ్యాంకు కేసులను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీస్, పోలీస్ డిపార్ట్‌మెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు సేంద్రీయ ఎరువులనే వాడాలి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని మర్లపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వ్యవసాయ శాఖ అధికారి బి.శివశంకర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలని, ఖర్చులను తగ్గించుకోవాలని, సేంద్రీయ ఎరువులను వాడాలని చెప్పారు. కోడిగుడ్డు కషాయం తయారు చేయడం గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచి వెల్డి రాజారావు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ముసునూరు : ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు వ్యవసాయ కార్యాలయంలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవ గాహన కల్పించారు. ఈ సందర్భంగా మధుమోహన్ మాట్లాడుతూ పకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యం కాపాడు కోవడంతో పాటు తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలు పొంద వచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పకృతి, సేంద్రీయ వ్యవ సాయ సిబ్బంది, మండల వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కామవరపుకోట : రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగహన పెంచుకోవడం వల్ల వ్యవసాయంలో అధిక దిగుబడి, లాభాలు పొందేందుకు అవకాశం ఉంటుందని మండల ఉద్యానవన శాఖ అధికారి జి.లక్కపతి అన్నారు. కామవరపుకోటలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పాడి పశువుల పోషణ, ఉద్యానవన పంటలపై అవగాహన కల్పించారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పేదవారికి ఖరీదైన వైద్యసేవలు అందుబాటులో ఉండాలనే సదాలోచనతో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి అన్నారు. పవర్‌పేటలోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో 12, 13, 15 డివిజన్లకు చెందిన గాదంశెట్టి శ్రీలక్ష్మికి రూ.75 వేలు, కంచరపు దేవేంద్రరావుకు రూ.1,28,285, ముక్కామల రాణికి రూ.1.62 లక్షలు సిఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందించారు.

ముసునూరు : కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిఎం సహాయ నిధి ద్వారా వైద్య సహాయం అందిస్తుందని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన జరపాల భవానికి రూ.98,708 చెక్కును స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం అందించారు.

నేడు చేపల చెరువుల బహిరంగ వేలం

ముదినేపల్లి : ముదినేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఉన్న ఆరు చేపల చెరువుల బహిరంగ వేలం పాటను గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ తెలిపారు. చేపల చెరువుల లీజు పాట కాలం మూడేళ్లుగా నిర్ణయించినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు కార్యాలయం వద్ద సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ అధ్యక్షతన జరిగే బహిరంగ వేలం పాటలో పాల్గొనాలని రమేష్ కోరారు. పెయ్యేరు గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగు చేపల చెరువులకు మూడేళ్ల లీజు కాల పరిమితికి ఈ నెల 25వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంట లకు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగే బహిరంగ వేలం పాటలో ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని కోరారు.

గోదావరి జలాలను తాగునీరుగా అందించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెంకటాపురం పంచాయతీ పరిధిలోని ప్రజానీకానికి గోదావరి జలాలను తాగునీరుగా అందించాలని సిపిఎం ఏలూరు వన్‌టౌన్ శాఖ సభ డిమాండ్ చేసింది. మాదేపల్లి మొండేల కాలనీలో గనిగంటి కోటేశ్వరరావు అధ్యక్షతన సిపిఎం ఏలూరు వట్ టౌన్ శాఖా మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ వెంకటాపురం పంచాయతీని కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నప్పుడు పంచాయతీ ప్రజానీకానికి మున్సిపాలిటీలో పంపిణీ చేస్తున్న గోదావరి జలాలనే తాగునీరుగా అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వెంటనే గోదావరి జలాలు వెంకటాపురం పంచాయతీ ప్రాంతంలో సరఫరా అయ్యే విధంగా కార్పొరేషన్ పాలకవర్గం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంకటాపురం పంచాయతీ పరిధిలో రోడ్లు, డ్రెయినేజీలు మెరుగుపరచాలని, పందులు, దోమల బెడదని అరికట్టాలని చెప్పారు. మొండేల కాలనీలో కరెంటు లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలన్నారు. రానున్న రోజుల్లో ఈ సమస్యలపై స్థానిక సిపిఎం శాఖ ప్రజలను కదిలించి ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి తాడిపూడి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వరద బాధితులను, రైతులను ఆదుకోవాలని ధర్నా

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

వరద బాధితులను, రైతులను ఆదుకోవాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజా పంథా వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి నగర్ గ్రామం వద్ద సుమారు 300 మంది వరద బాధితులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి ఎస్‌కె.గౌస్, పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు మాట్లాడుతూ మండలంలో గత జులై నెలలో కురిసిన భారీ వర్షాలకు పెద్ద వాగు ప్రాజెక్టు గండిపడి మేడేపల్లి, రామవరం పంచాయతీల్లోని కమ్మరిగూడెం, అల్లూరినగర్ గ్రామాలు కొట్టుకుపోయాయన్నారు. వారికి ప్రభుత్వం అప్పుడు తక్షణ సహాయం అందించినా బాధితులకు పరిష్కార మార్గం చూపలేదన్నారు. పెద వాగు ప్రాజెక్ట్ ప్రధాన కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేసి ప్రాజెక్టు వెంబడి ఉన్న గ్రామాల్లోకి ఆయా గ్రామాల భూములపై వరద పడకుండా కరకట్ట నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు. పెదవాగు ప్రాజెక్టు వల్ల సర్వం కోల్పోయిన వరద బాధితులకు, రైతులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వారికి ప్రత్యేక కాలనీ నిర్మించాలని, వరదలకు కొట్టుకుపోయిన పూరి ఇళ్లకు రూ.లక్ష, డాబాలకు రూ.రెండు లక్షలు ఇవ్వాలని, వారికి కొత్త కాలనీలు ఏర్పాటు చేసి ఇళ్లను కట్టించి ఇవ్వాలని కోరారు. వరదల్లో కొట్టుకుపోయిన గేదెలకు రూ.లక్ష, ఎడ్లు, ఆవులకు రూ.50 వేలు, గొర్రెలు, మేకలకు రూ.30 వేలు, రైతులకు బ్యాంకుల అప్పులను రద్దు చేయాలని కోరారు. ఈ సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటాలు చేసి దశలవారీగా ఉద్యమాలు చేపడతామన్నారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న తహశీల్దార్ సంఘటనా స్థలానికి వెళ్లి ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం దిశగా ప్రయత్నిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ ధర్నాలో పార్టీ మండల కార్యదర్శి సోయం చంద్రరావు, పార్టీ డివిజన్ నాయకులు కట్టం వీరాస్వామి, మేడేపల్లి సర్పంచి కట్టం రాంబాబు, మేడిపల్లి ఎంపిటిసి సభ్యులు తుర్రం తమ్మయ్య, కారం భాస్కర్, తుర్రం రాజారావు, ఇందూరి శ్రీను, చిలుకూరు లక్ష్మణ్, కుంజ సూరయ్య ఎం.ధర్మయ్య, పోతయ్య, కె.సుగుణ, ఎస్‌కె.మున్ని పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడాలి : జనసేన

ప్రజాశక్తి - కామవరపుకోట

గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో గ్రామస్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ కామవరపుకోట టౌన్ ప్రెసిడెంట్ బొబ్బిలి వీరబాబు అన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన రవినాయక్‌ను వారు బుధవారం కలిసి శాలువా కప్పి అభినందించారు. గ్రామస్తుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల నాయకులు సిరిగినేటి వెంకన్నబాబు, మున్నంగి శ్రీనివాస్ కుమార్ పాల్గొన్నారు.

మినీ గోకులాల పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ఉంగుటూరు : మినీ గోకులాల పథకానికి సంబంధించి లబ్ధిదారులైన రైతులకు, ఉపాధి హామీ చట్టం సిబ్బందికి మధ్య సమన్వయ సమావేశం బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఉంగుటూరు ఎంపిడిఒ జిఆర్.మనోజ్ మాట్లాడుతూ ఉంగుటూరు మండలానికి మొదటి విడతగా 65 మినీ గోకులాల షెడ్లు మంజూరయ్యాయని, వీటికి సంబంధించి షెడ్ల నిర్మాణానికి రూ.2.30 లక్షలు ఖర్చు చేస్తారని తెలిపారు. ఈ షెడ్లు చేపట్టే విధానం, వాటి విధివిధానాలు, ఎప్పటిలోగా పూర్తి చేయాలనే తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

CHANGE OF NAME

I, **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** W/o. Addepalli Viswanadh, and Resident of D.No. 17-12-14, Lakshmivarapupeta, Near Ramalayam, Tangellamudi, ELURU, West Godavari District -A.P changing my Name from **ADDEPALLI BRAMARAMBA SITA PADMAJA CHAITANYA** (OLD NAME) to **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** (NEW NAME) Hence forth Iam being called as **ADDEPALLI BHRAMARAMBHA SITA PADHMAJA CHAITANYA** (NEW NAME) for all purposes.

పాస్‌పోర్టు పోయినది

BARRI LAKSHMI NARASAMMA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.01-08-2024న C0654562 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరు చేసారు. సదరు పాస్ పోర్టు జిరాక్స్ తీయించుకునేందుకు ది.15-10-2024న మా ఇంటి నుండి మొగల్తూరు సెంటర్‌కు వెళ్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

BARRI LAKSHMI NARASAMMA
W/o. Barri Narayana Swamy
D.No. 6-89/1, ETIMONDI, Perupalem Post
Mogalturu Mandal, W.G.Dt., A.P.

CHANGE OF NAME

I **Donadri Chinna Appanna, S/o. Donadri Hanumanthu** and Residing at D.No.13-202, Sai Nagar, Kothuru Road, Eluru, Eluru District, Andhra Pradesh, Pin: 534001, Cell No. 93945 60909. Changing My Name From **Donadri China Appanna (Old Name)** to **Donadri Chinna Appanna, S/o. Dondari Hanumanthu (New Name).** Hence Forth I am being Called as **Donadri Chinna Appanna (New Name).** For All Purposes.

పాస్‌పోర్ట్ పోయినది

ఆచంట మండలం, వల్లూరుకు చెందిన మానేపల్లి శ్రీనివాసరావు, తండ్రి: మానేపల్లి సత్యనారాయణ, డో.నెం.6-103(1), వల్లూరు, ఆచంట మండలం, ప॥గో॥జిల్లా, ఏపీ తెలియజేయునది ఏమనగా.., నేను వైజాగ్‌లో ది.04-2-2004న తీసుకున్న **E7394738 పాస్ పోర్ట్ పోయినది.** నేను ది.24-05-2024న వల్లూరులో మా ఇల్లు షిఫ్ట్ అవుతుండగా ఆ పాస్‌పోర్టు మిస్ అయినది. ఎంత వెతికినను ఎక్కడా దొరకలేదు. నా పాస్‌పోర్ట్ ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్ నెంబర్: 9866196169

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

E.P.No.50/2019 in O.S.No.131/2014

బిట్వీన్:

బాలనాగు సూర్యకుమారి
...పిటీషనరు /డిక్రీ హోల్డరు
అండ్
1) యండ్ర సత్యనారాయణ
2) యండ్ర మంగాభాయి
...రెస్పాండెంటు /జడ్జిమెంట్ డేటర్స్

టు:

1) యండ్ర సత్యనారాయణ, తండ్రి: రామదాసు, వయస్సు 65 సం॥లు, పురుషుడు, పోర, ఆచంట మండలం.
2) యండ్ర మంగాభాయి, భర్త: సత్యనారాయణ, వయస్సు 60 సం॥లు, స్త్రీ, పోర, ఆచంట మండలం.

పై నెంబరు వారంటు అమలు గ్రంథములో జడ్జిమెంటు డేటర్స్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థిని **ది.08-11-2024వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పైన తెలిపిన కోర్టు నందు వేలం ద్వారా విక్రయించబడును.** కావున కావలసిన వారు వేలంలో పాల్గొని క్రియం పొందగలరు.

షెడ్యూల్

West Godavari District, Achanta Sub Registration District, Achanta Mandal, Achanta Village.
Item No.1: Ac.0-06 cents of Zeroyat wet land out of Ac.1-10 cents in R.S.No.635/3.
Item No.2: Ac.0-04 cents out of Ac.0-44 cents Zeroyat wet land in R.S.No.635/4.
Total extant of Item No.1 and Item No.2 is an extant of Ac.0-10 cents is a common plot bounded by:
East: Penumanchili Canal. ***West:*** Land of Yandra Manga Bai. ***South:*** Land of Jogi Sriramulu, Narayudu, Vendra Venkatarao. ***North:*** Lands of Manne Ramakrishna and his family members.
With all easementary rights.

Amin Value : Rs.1,60,000/-
D.H.R.Value : Rs.1,37,546/-
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు, న్యాయవాది,
22-10-24. పాలకొల్లు, ప॥గో॥జిల్లా.